సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



గని సందర్శన

గోదావరిఖని: రామగుండం డివిజన్‌–1లోని జీడీకే–2, 2ఏ గనిని ఆపరేషన్స్‌ డైరెక్టర్‌ ఎన్‌వీకే శ్రీనివాస్‌ శనివారం సందర్శించారు.



ముగిసిన సమావేశాలు

గోదావరిఖని: మల్టీ డిపార్ట్‌మెంటల్‌ ముగింపు సమావేశాలు ఆర్‌సీవోఏ క్లబ్‌లో ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/23.6

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్‌

భూ సేకరణపై గ్రామసభ

ముత్తారం(మంథని): జాతీయ రహదారి నిర్మాణం కోసం లక్కారంలో చేపట్టే భూ సేకరణపై మంథని ఆర్డీవో హనుమా నాయక్‌ శనివారం రైతులతో సమావేశమయ్యారు. భూములు కోల్పోతున్న రైతులకు 2103 చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తామని ఆర్డీవో తెలిపారు. అయితే, మార్కెట్‌ ధరకన్నా మూడింతలు అధికంగా పరిహారం చెల్లించాలని రైతులు కోరారు. వారి సమస్యలను ఆర్డీవో నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి వరలక్ష్మి, తహసీల్దార్‌ రాజేశ్వరి, మాజీ సర్పంచ్‌ అత్తె లలిత, ఎంపీటీసీ ఒద్ది తిరుమల, ఆర్‌ఐ శ్రీధర్‌, నిర్వాసితులు పాల్గొన్నారు.

మహనీయులను మరిచిన కాంగ్రెస్‌



క్షీరాభిషేకం చేస్తున్న మధు

మంథని: గాంధీ కుటుంబానికి తప్ప మహనీయులు, ఆలోచనాపరులను పట్టించుకోని చరిత్ర కాంగ్రెస్‌ది అని, ఈక్రమంలోనే పార్టీని, దేశాన్ని బతికించిన మాజీప్రధాని పీవీ నరసింహారావును అవమాన పరిచారని జిల్లా పరిషత్‌ చైర్మన్‌ పుట్ట మధు విమర్శించారు. పట్టణంలోని పీవీ నరసింహారావు విగ్రహానికి శనివారం ఆయన క్షీరాభిషేకం చేశారు. అనంతరం మధు మాట్లాడారు. మంథని పేరును ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు పీవీ అని కొనియాడారు. మాజీ సీఎం కేసీఆర్‌ పీవీకి భారతరత్న ప్రటించాలని అసెంబ్లీలో తీర్మానించి కేంద్ర ప్ర భుత్వానికి నివేదించారని గుర్తుచేశారు. జెడ్పీటీసీ తగరం సుమలత, కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ ఆరెపల్లి కుమార్‌, కౌన్సిలర్లు గర్రెపల్లి సత్యం, కాయిత సమ్మయ్య, నాయకులు తగరం శంకర్‌లాల్‌, పూదరి సత్యనారాయణగౌడ్‌ పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

పెద్దపల్లిరూరల్‌: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో ఈనెల 12న మధ్యాహ్నం 2గంటలకు జిల్లాస్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని కబడ్డీ అసోసియేషన్‌ జిల్లా ప్రధానకార్యదర్శి తోట శంకర్‌ శనివారం తెలిపారు. 55 కిలోల లోపు బరువు ఉండి, 2008మార్చి 20 తర్వాత జన్మించిన విద్యార్థులు పోటీలకు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు వెంట ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకు రావాలని సూచించారు. వివరాలకు 92480 46244, 99498 42453 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


అర్హులకు సంక్షేమ పథకాల ఫలాలు అందాలి



వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో మధుమోహన్‌

సుల్తానాబాద్‌(పెద్దపల్లి): జిల్లావ్యాప్తంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది పకడ్బందీగా విచారణ చేపట్టాలని పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్‌ సూచించారు. మున్సిపల్‌ పరిధిలో శనివారం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల సర్వే ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు ఆధార్‌, రేషన్‌కార్డు జిరాక్స్‌లు, ఫోన్‌నంబర్లు తీసుకోవాలని పేర్కొన్నారు. తహసీల్దార్‌ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ మల్లికార్జున్‌గౌడ్‌ పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపిక



ఎంఈవోతో మనోజ్‌

పెద్దపల్లిరూరల్‌: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన మనోజ్‌ జాతీయస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపికయ్యాడని ఎంఈవో సురేంద్రకుమార్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో మనోజ్‌ ప్రతిభను చూపాలని ఎంఈవో ఆకాంక్షించారు. మనోజ్‌ను ఎంఈవోతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

గ్యారంటీల పద్దు

- ఉమ్మడి జిల్లాకు రూ.3 వేలకోట్ల నుంచి రూ.5వేల కోట్లు కావాలి
- ఇప్పటికే మొదలైన ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు ప్రయాణం
- 'గృహజ్యోతి' అమలుకు మొదలైన ప్రక్రియ
- టెంపుల్‌ సిటీలుగా వేములవాడ, ధర్మపురి



సాక్షిప్రతినిధి, కరీంనగర్‌:

ఆరు గ్యారంటీల హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ పార్టీ ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌లో వాటికే పెద్దపీట వేసింది. మొత్తంగా ఆరు హామీల అమలుకు రూ.53,196 కోట్లకుపైగా కేటాయించింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలవుతోంది. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌ సరఫరాకు ఇప్పటికే ప్రక్రియ మొదలైంది. రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలు దిశగానూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. బౌద్ధ, జైన క్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించడంతో కరీంనగర్‌ జిల్లా నేలకొండపల్లిలోని బొమ్మలగుట్ట జైన, పెద్దపల్లి జిల్లా ధూళికట్టలోని బౌద్ధ క్షేత్రాలకు మంచిరోజులు రానున్నాయని ఉమ్మడి జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు. కరీంనగర్‌లోని శాతవాహన, జగిత్యాల జిల్లాలోని కొండగట్టు, పెద్దపల్లి జిల్లాలోని మంథని జేఎన్టీయూల్లో మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌ కేటాయించారు. అర్హులైన గృహిణులకు ప్రతినెలా రూ.2,500 చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని గతంలోనే సీఎం రేవంత్‌ రెడ్డి ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఆరు గ్యారంటీలను అమలు చేయాలంటే రూ.3 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

అంజనాద్రి ప్రస్తావన లేదు



ఉమ్మడి జిల్లాలో రెండు ప్రాచీన పుణ్యక్షేత్రాలైన వేములవాడ, ధర్మపురిలను టెంపుల్‌ సిటీల కింద అభివృద్ధి చేయనున్నారు. గతంలో వేములవాడ టెంపుల్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ(వీటీడీఏ) కింద రూ.50 కోట్లు కేటాయించారు. ఇటీవల పలుమార్లు వీటీడీఏ అధికారులు ఈ విషయంపై సమావేశమైన విషయం తెలిసిందే. ఈ పుణ్యక్షేత్రాలను ఎలా అభివృద్ధి చేస్తారనే అంశంలో మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది. గతేడాది కొండగట్టును అంజనాద్రిగా మార్చి, రూ.600 కోట్లు కేటాయిస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ఈ ఆలయ ప్రస్తావన బడ్జెట్‌లో రాలేదు.

విద్యారంగానికి నిధులు



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు స్వల్పంగా కేటాయించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం 15శాతం నిధులు కేటాయిస్తే బాగుండేది. గురుకుల పాఠశాలలకు శాశ్వత భవన నిర్మాణాలకు నిధులు కేటాయించడం సంతోషకరం. తెలంగాణ పబ్లిక్‌ స్కూళ్ల ఏర్పాటుకు రూ.500కోట్లు కేటాయిస్తూ ప్రతిపాదించారు. అలా కాకుండా ప్రసుతం ఉన్న పాఠశాలలనే పబ్లిక్‌ స్కూళ్లుగా అప్‌గ్రేడ్‌ చేస్తే బాగుంటుంది.

– గద్దె శ్రీనివాస్‌, యూటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి

కార్మికులను విస్మరించారు



రాష్ట్ర బడ్జెట్‌లో కార్మిక సంక్షేమాన్ని విస్మరించారు. కనీస వేతనాల పెంపు ప్రస్తావన కూడా లేకపోవడం విచారకరం. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులను పర్మినెంట్‌ చేసేఊసే బడ్జెట్‌లో లేదు. ఇది ప్రజారంజక బడ్జెట్‌ అసలే కాదు. రాష్ట్రప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ కార్మికులు, సిబ్బంది సంక్షేమాన్ని విస్మరించడం శోచనీయం. పాలకులు ఇప్పటికైనా పునరాలోచన చేయాలి. భవిష్యత్‌లోనైనా కాంట్రాక్టు వర్కర్లకు న్యాయం చేసేలా బడ్జెట్‌ రూపొందించాలి.

– ముత్యంరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

విద్యారంగానికి పెద్దపీట అభినందనీయం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులను స్వాగతిస్తున్నాం. రూ.2,75,891 కోట్ల బడ్జెట్‌లో రూ.21,389కోట్లు విద్యారంగానికి కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల విద్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించడం హర్షణీయం. ప్రతీ మండలంలో అత్యాధునిక సాకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్‌ స్కూళ్ల ఏర్పాటుకు రూ.500 కోట్లు ప్రతిపాదించారు. ఈ పాఠశాలలు జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేయాలి.

– ఆరెల్లి కుమారస్వామి, జిల్లా సాంఘికశాస్త్రం ఫోరం ప్రధాన కార్యదర్శి

పొంతనలేదు



కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు, ఆ పార్టీ ఎన్నికల కోసం చేసిన వాగ్దానాల హామీల అమలుకు అయ్యే ఖర్చులకు పొంతనలేదు. బడ్జెట్‌ సాక్షిగా హామీల అమలుపై కాంగ్రెస్‌ చేతులెత్తేసినట్టు స్పష్టంగా అర్థమవుతోంది. నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

– గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

రైతు వ్యతిరేక బడ్జెట్‌



కాంగ్రెస్‌ ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ పూర్తి రైతు వ్యతిరేక బడ్జెట్‌. ఇందులో రైతులకు సంబంధించిన విషయాన్నే ప్రస్తావించలేదు. రైతు భరోసా, రైతుబీమా, రుణమాఫీ, కౌలు రైతులకు సాయం వంటి అంశాలకు బడ్జెట్‌లో ఎంత కేటాయిస్తారో వివరించలేదు. గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌, వాటి అమలుకు నిధులు కేటాయించలేదు. వాటిని ఎప్పుడు అమలు చేస్తారో చెప్పనే లేదు. ఇది పూర్తిగా రైతు వ్యతిరేక బడ్జెట్‌.

– సుంకె రవిశంకర్‌, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే

రైతుల కోసం..

ఉమ్మడి జిల్లాలో రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఎకరాకు రూ.2 లక్షల చొప్పున మాఫీ చేస్తామని, ఎకరాకు పెట్టుబడి సాయం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. అలాగే, కౌలు రైతులకు ఆర్థికసాయానికి మార్గదర్శకాలు సిద్ధమవుతున్నాయి.

రైతు భరోసా లబ్ధిదారులు

కరీంనగర్‌ :	2,03,096
పెద్దపల్లి:	1,39,482
జగిత్యాల:	1,63,000
సిరిసిల్ల:	1,34,725



త్వరలో రూ.500కు గ్యాస్‌ సిలిండర్‌

రూ.500కే సబ్సిడీ గ్యాస్‌ సిలిండర్‌ పథకాన్ని ప్రభుత్వం త్వరలో అమలు చేయనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 లక్షల గ్యాస్‌ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో తెల్లరేషన్‌ కార్డులు ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

గ్యాస్‌ కనెక్షన్ల సంఖ్య

కరీంనగర్‌:	1,32,210
పెద్దపల్లి :	1,31,098
జగిత్యాల:	1,28,312
సిరిసిల్ల:	1,09,100




గ్రామాలకు మంచి రోజులు

కొన్ని నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలు నిధుల్లేక ఇబ్బంది పడుతున్నాయి. కనీసం సిబ్బందికి వేతనాలిచ్చే పరిస్థితి లేదు. చేసిన బిల్లులు రాక కాంట్రాక్టర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంచాయతీరాజ్‌ శాఖకు రూ.40 వేల కోట్ల పైచిలుకు బడ్జెట్‌ కేటాయించడంతో ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలన్నీ కోటి ఆశలతో ఎదురుచూస్తున్నాయి.

పంచాయతీల సంఖ్య

కరీంనగర్‌:	313
పెద్దపల్లి :	266
జగిత్యాల:	380
సిరిసిల్ల:	255



ప్రజాపాలన దరఖాస్తులే కీలకం

ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం.. ఆరు గ్యారంటీల అమలుకు ప్రజాపాలన దరఖాస్తులే కీలకం. తెల్ల రేషన్‌కార్డు ప్రామాణికం. అయితే, ఈ అర్జీల ఫాంలు నింపడంలో కొందరు లబ్ధిదారులు పొరపాట్లు చేశారు. విద్యావంతులు అధికంగా ఉండే కరీంనగర్‌లోనే దాదాపు 20 వేలకుపైగా దరఖాస్తుల్లో గ్యాస్‌కు సంబంధించిన సమాచారం తప్పుగా ఇచ్చినట్లు సమాచారం. మిగిలిన జిల్లాల్లోనూ ఇదే తరహా తప్పులు దొర్లాయి. ప్రస్తుతం అధికారులు వీటిని సరిచేస్తున్నారు. ఆ తర్వాత పథకాలు వర్తింపజేయనున్నారు.

ప్రజాపాలన	దరఖాస్తులు	తెల్ల రేషన్‌కార్డులు
కరీంనగర్‌	3,54,363	2,74,093
పెద్దపల్లి	2,40,371	2,49,000
జగిత్యాల	3,24,532	3,07,659
సిరిసిల్ల	1,92,617	1,73,368



45,500 మందికి ఇందిరమ్మ ఇళ్లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజకవర్గానికి 3,500 మంది చొప్పున మొత్తం తొలి విడతలో 45,500 మందికి సొంతింటి కల నెరవేర్చనున్నారు. సొంతింటి జాగ ఉంటే రూ.5 లక్షల ఆర్థికసాయం కూడా అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

వలస కూలీల విషాదం

- నాసిరకం భోజనంతోనే అస్వస్థత
- పరిస్థితి విషమించి ఇద్దరి మృతి
- మరో 35మందికి అస్వస్థత
- పెద్దపల్లిలో 8మందికి చికిత్స
- మిగతావారు కరీంనగర్‌, హైదరాబాద్‌ తరలింపు
- విచారణ జరిపిన తహసీల్దార్‌ రాజ్‌కుమార్‌



పెద్దపల్లిలో చికిత్స పొందుతున్న కూలీలు



ఇటుక బట్టీల్లో విచారణ జరుపుతున్న అధికారులు



చికిత్స పొందుతున్న కూలీలు



వివరాలు తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది

పెద్దపల్లిరూరల్‌: పొట్ట కూటికోసం పిల్లాపాపలతో ఊరుకాని ఊరు వలస వచ్చిన ఒడిశా వలసకూలీల ప్రాణాలకు భరోసా లేకుండాపోయింది. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు.. శుభ్రమైన, నాణ్యమైన భోజనం కూడా వారికి అందడంలేదు. కొన్ని సందర్భాల్లో ఇలాంటి ఆహారం వారి ప్రాణాలను తీస్తోంది. ఈ క్రమంలోనే గౌరెడ్డిపేటలోని ఎంఎస్‌ఆర్‌ ఇటుక బట్టీలో పనిచేసే కార్మికులు నాసిరకం భోజనం తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ఇద్దరు చనిపోగా, 35మంది చికిత్స పొందుతున్నారు. కలుసిత మాంసాహారం తినడంతో వీరు అస్వస్థతకు గురయ్యారు. అందులో ఒడిశాలోని బాలంగీర్‌ జిల్లా ధన్ముండకు చెందిన చంద్రశేఖర్‌ బారియ(54), నౌపడ జిల్లా రూపియంబ ప్రాంతానికి చెందిన లలిత మాంఝీ(26) మృతిచెందారు. మిగతా వారిలో నలుగురు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రి, కరీంనగర్‌లో 13మంది, హైదరాబాద్‌ ఆస్పత్రిలో ఒకరు చికిత్స పొందుతున్నట్లు సమాచారం. మిగతా వారి ఆరోగ్య పరిస్థితి మెరుగు పడడంతో వైద్యులు డిశ్చార్జ్‌ చేశారని చెబుతున్నారు.

ఉపాధి కోసం వచ్చి..

ఉపాధి అవకాశాల కోసం కూలీలు ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడి ఇటుక బట్టీల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. బట్టీలు ఉన్న ప్రాంతంలోనే కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. పనులు చేశాక వారంలో ఒకరోజు పెద్దపల్లికి వచ్చి తమకు అవసరమైన వస్తు, సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఇందులో తక్కువ ధరకు లభించే చికెన్‌ వ్యర్థాలు, కుళ్లిన, నాసిరకం కూరగాయలు కొనుగోలు చేస్తారని తెలుస్తోంది. ఈక్రమంలోనే ఓ వ్యక్తి గౌరెడ్డిపేట ఇటుకబట్టీల ప్రాంతంలో తక్కువ ధరకే మాంసం విక్రయించారని, దానిని వండి తిన్నాక కూలీలు అస్వస్థతకు గురైనట్లు చర్చించుకుంటున్నారు. బట్టీలో పనిచేసే ఇద్దరు కూలీలు ఇటీవల కోడికాళ్ల విషయంలో తలెత్తిన గొడవతో ఘర్షణ పడగా.. ఓ కూలీ హత్యకు గురైన విషయం విదితమే.

అందని పౌష్టికాహారం..

వలసకూలీలకు పౌష్టికాహారం అందించడంలో పాలకులు, అధికారులే కాదు.. బట్టీల నిర్వాహకులూ విఫలమవుతున్నారు. వలస కూలీలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించాలని అప్పట్లో అధికారులు ఇచ్చిన ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు. గర్భిణులు, చిన్నారులకు సైతం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరుకులు అందడం లేదంటున్నారు. అయితే, తాము పంపిణీ చేస్తున్నామని అధికారులు వివరించడం గమనార్హం. కేంద్రప్రభుత్వం పోర్టబిలిటీ సౌకర్యం కల్పించడంతో కూలీలు స్థానిక రేషన్‌ దుకాణాల్లో రేషన్‌ బియ్యం పొందుతున్నారు. వీరికోసం గతంలో శనగలు పంపిణీ చేయాలని సూచించినా.. పంపిణీ చేయకపోవడంతో డీలర్ల వద్దే ఏళ్లుగా ముక్కిపోతున్నాయి.

అనారోగ్యం పాలైతే ఆయుష్షు తీరినట్టేనా..!

ఇటుకబట్టీల్లో పనిచేసే వలస కూలీలు అస్వస్థతకు గురైతే ఆయుష్షు తీరినట్టే. మట్టిలో నిత్యం పనిచేసే కూలీల్లో.. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల్లో రక్తహీనత సమస్యలు అధికంగా ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. బట్టీల్లో ప్రమాదాలకు గురైనా, అనారోగ్యం పాలైనా సమీపంలోని పీహెచ్‌సీలు, ఆర్‌ఎంపీలతో నామమాత్రపు వైద్య సేవలు అందుతున్నాయి. వీరి శ్రమతో అధిక ఆదాయం ఆర్జించే ఇటుక బట్టీ యజమానులు.. బలవర్ధక ఆహారం సమకూర్చి, ఆరోగ్యం కాపాడాలని కోరుతున్నారు.

అధికారుల విచారణ..

కలుషితఆహారం తిని ఇద్దరు కూలీలు మృతి చెందడం, పలువురు అస్వస్థతకు గురైన ఘటనపై తహసీల్దార్‌ రాజ్‌కుమార్‌, సీఐ కృష్ణ, కార్మికశాఖ అధికారి రామ్మోహన్‌ బట్టీల్లో విచారణ చేపట్టారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తహసీల్దార్‌ తెలిపారు.

బిహార్‌ ముఠా.. మళ్లీ వచ్చిందా?

- శనివారం తెల్లవారుజామున 1.30 గంటలు : ముసుగులు ధరించిన నలుగురు దొంగలు ఓ కారులో గోదావరిఖని గంగానగర్‌ ఏటీఎంలోకి వచ్చారు. రాజీవ్‌ రహదారి పక్కనే ఉండడం, అదేసమయంలో పోలీసు వాహనం సైరన్‌ వినిపించడంతో ఆ ప్రయత్నం మానుకున్నారు.
- శనివారం వేకువజామున 1.56 గంటలు : గౌతమినగర్‌కు చేరుకున్న దొంగలు.. అక్కడి ఏటీఎం ముందు భాగాన్ని గ్యాస్‌ కట్టర్‌తో కట్‌ చేశారు. అందులోని రూ.27.75లక్షలు చోరీ చేశారు.
- 2021మార్చి 24న : ఇదేతరహాలో గుంజపడుగ ఎస్‌బీఐలో గ్యాస్‌ కట్టర్లతో సేఫ్టీ లాకర్‌ కట్‌చేశారు. 6 కేజీల బంగారం, రూ.18లక్షల నగదు ఎత్తుకెళ్లారు

- ఉత్తర్‌ప్రదేశ్‌ గ్యాంగ్‌పైనా అనుమానాలు
- గంగానగర్‌లో ఏటీఎం చోరీకి విఫలయత్నం
- గౌతమినగర్‌ ఏటీఎంలో భారీగా నగదు అపహరణ
- ముసుగులు ధరించి వచ్చిన ముష్కరులు
- విచారణ వేగవంతం చేసిన పోలీసులు



సీసీ కెమెరాకు కలర్‌ స్ప్రే చేస్తున్న దొంగ

ప్రత్యేక బృందాలతో గాలింపు

ఏటీఎంలో చోరీకి పాల్పడిన ముఠాను గుర్తించే పనిలో ఉన్నాం. ఆదివారం వరకు నిందితుల గురించి స్పష్టత వచ్చే అవకాశం. దొంగలను పట్టుకునేందుకు ఐదు బృందాలను నియమించాం.

– తులా శ్రీనివాస్‌, ఏసీపీ, గోదావరిఖని

గోదావరిఖని: బ్యాంకులు కొల్లగొట్టే ముఠా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి వచ్చిందా? ముఖానికి ముసుగులు ధరించిన దొంగలు కారులో వచ్చి ఒకేరోజు, కొద్ది నిమిషాల వ్యవధిలోనే రెండు ఏటీఎంలలో చోరీలకు పాల్పడడం, అదికూడా గతంలో జరిగిన దొంగతనాలను పోలిఉండడం అనుమానాలకు తావిస్తోంది. శనివారం తెల్లవారుజామున 1.30గంటలకు గంగానగర్‌లోని ఏటీఎం వద్దకు చేరుకున్న దొంగలు.. చోరీకి యత్నిస్తున్న సమయంలోనే పోలీసు వాహనం సైరన్‌ వినిపించడంతో పరారైనట్లు తెలుస్తోంది. అక్కడ నుంచి నేరుగా గౌతమినగర్‌లోని ఏటీఎం వద్దకు చేరుకున్నారని, లోనికి చొరబడి షెట్టర్‌ మూసివేసి యంత్రం ముందు భాగం గ్యాస్‌ కట్టర్‌తో కట్‌ చేశారని పోలీసులు భావిస్తున్నారు. గంగానగర్‌లో విఫలమైన దొంగలు.. ఎఫ్‌సీఐ గౌతమినగర్‌ ఏటీఎంలోంచి రూ.27.75లక్షలు ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన సీసీ ఫుటేజీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వచ్చింది నలుగురు.. చోరీలో ఒకరు..

దొంగలు కారులో వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అందులో నలుగురు ఉండగా.. ఒకరు ఏటీఎంలోకి వెళ్లి సీసీ కెమెరాలకు కలర్‌ స్ప్రే చేశాడని, ఆ తర్వాత చోరీకి యత్నించాడని, మిగతా వారు బయట కాపలా కాశారని పోలీసులు అనుమానిస్తున్నారు. తొలుత గంగానగర్‌లోని ఏటీఎం చోరీకి యత్నించి, అక్కడనుంచి గౌతమినగర్‌కు చేరుకుని అక్కడి ఏటీఎంలో చోరీచేసి అక్కడ నుంచి తిరిగి కారులో రాజీవ్‌ హైవేవైపు వచ్చి పరారైనట్లుగా అంచనా వేస్తున్నారు.

గుంజపడుగు బ్యాంకు చోరీ తరహాలో..

మంథని మండలం గుంజపడుగ ఎస్‌బీఐ చోరీ తరహాలో 'ఖని' ఏటీఎంలలో చోరీ జరిగినట్లుగా భావిస్తున్నారు. 2021మార్చి 24న ప్రత్యేక వాహనంలో గ్యాస్‌ కట్టర్లతో వచ్చిన 8మంది సభ్యులు గల ముఠా.. బ్యాంక్‌ వెనుక నుంచి లోనికి చొరబడి గ్యాస్‌ కట్టర్లతో సేఫ్టీ లాకర్‌ కట్‌ చేశారు. అందులోని 6కిలోల బంగారం, రూ.18లక్షల నగదు ఎత్తుకెళ్లారు. అప్పట్లో ఈచోరీ సంచలనం సృష్టించింది. సుమారు రూ.3కోట్ల విలువ చేసే బంగారం, నగదు చోరీకి గురైంది. అప్పటి రామగుండం పోలీస్‌కమిషనర్‌ సత్యనారాయణ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాలను నియమించి దొంగలను పట్టుకున్నారు. సెల్‌ లొకేషన్‌ ఆధారంగా దొంగలను పట్టుకుని, వారినుంచి సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

మందమర్రిలో పరికరాలు లభ్యం

మందమర్రిరూరల్‌: గోదావరిఖనిలో ఏటీఎంల చోరీకి దొంగలు వినియోగించిన పరికరాలను మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీసుస్టేషన్‌ పరిధి అందుగులపేట జాతీయ రహదారి పక్కన శనివారం ఉదయం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. వారు గోదావరిఖనిలో ఏటీఎం చోరీకి వినియోగించిన పరికరాలుగా భావించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్‌టీంతో అందుగులపేటకు చేరుకుని గ్యాస్‌కట్టర్‌తోపాటు ఏటీఎం మిషన్‌కు సంబంధించిన డబ్బులు నిల్వ ఉంచే బాక్సులు, పరికరాలు స్వాధీనం చేసుకుని తీసుకెళ్లారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పరికరాలు ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో పోలీసులు అత్యంత గోప్యంగా వివరాలు సేకరిస్తున్నారు.

డిప్యూటీ కలెక్టర్‌, తహసీల్దార్ల బదిలీ

సాక్షి, పెద్దపల్లి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం రెవెన్యూ అధికారుల బదిలీలు చేపట్టింది. ఎన్నికల కమిషన్‌ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రాజేంద్రనగర్‌ ఆర్డీవో ఇ.మల్లయ్యను సింగరేణి స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్‌ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే మల్టీజోన్‌–1 పరిధిలో పెద్దపల్లి కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్‌ బి.రాజమణిని జగిత్యాలకు, కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఇ.పుష్పాలతను, మంథని ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న టి.రవీందర్‌ను కొమురం భీం ఆసిఫాబాద్‌ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే జగిత్యాల జిల్లాకు చెందిన తహసీల్దార్‌ మహ్మద్‌ ఆరీఫ్‌వుద్దీన్‌, కరీంనగర్‌కు చెందిన వీ.రమేశ్‌, జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాకు చెందిన పి.సుమన్‌ పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేయనున్న కమాన్‌పూర్‌ తహసీల్దార్‌ వి.మోహన్‌రెడ్డిని ఎన్నికల విధులతో సంబంధంలేని కలెక్టరేట్‌ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

ఫిక్స్‌డ్‌ వేతనం చెల్లించాలి

కాల్వశ్రీరాంపూర్‌(పెద్దపల్లి): ప్రజారోగ్యం పరిరక్షణ కోసం ఇంటింటా మందులు పంపిణీ చేస్తూ, సుఖప్రసవాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఆశవర్కర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి విమర్శించారు. ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్‌ వేతనం అమలు చేయాలని, పెండింగ్‌ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ మెడికల్‌ ఆఫీసర్‌ మహేందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈనెల 16న సమ్మె చేస్తామని తెలిపారు. నాయకులు టి.శారద, మౌనిక, రాజేశ్వరి, మానస, సునీత, రాధ, సుమలత ఉన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జనార్దన్‌రెడ్డి, తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల, ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్ ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25న జరుగనున్న రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల పోస్టర్‌ను శనివారం ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, వాగ్దేవి కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ ఆవిష్కరించారు. తొలిసారిగా జిల్లాకేంద్రంలో కుంగ్‌ఫూ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్‌ను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.రాజశేఖర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ.మునీందర్‌గౌడ్, పీజీ ఇన్‌చార్జి పి.రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ ఏ.శ్రీనివాస్, నరేశ్, సీనియర్ మాస్టర్స్ మూర్తి, మోయిన్, రవివర్మ, శేఖర్, సాగర్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు



క్రీడాకారులతో పరిచయం

రామడుగు: రామడుగు జిల్లా పరిషత్ పాఠశాల క్రీడామైదానంలో శనివారం ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దాదాపు 350 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. రామడుగు జిల్లా పరిషత్ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోటీలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వేంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, పెద్దపల్లి సురేందర్, కృష్ణహరి, యశోద, విజయ్, సూర్య, అమర్‌సాయి, శివాజీ పాల్గొన్నారు.

అందాలు ఆరబోసే ఎల్‌మడుగు

• గుట్టల మధ్య గోదావరి గలగలలు • ఆకట్టుకుంటున్న ప్రకృతి సోయగాలు
• పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి అవకాశం

నునుపు రాళ్లతో కూడిన గుట్టలు.. వాటి మధ్య గోదావరి జలసవ్వడి.. ఆకట్టుకునే నీలిరంగు నీళ్లు.. చుట్టూ పర్చుకున్న పచ్చదనం.. ఆహ్లాదకరమైన ప్రకృతి అందాలు.. ఎంతసేపు చూసినా తనివితీరని దృశ్యాలు ఎల్‌మడుగు సొంతం. మంథని పట్టణానికి సమీపంలో ప్రకృతి ఆరబోసే అందాలపై సండే స్పెషల్. – మంథని

సండే స్పెషల్



గుట్టల మధ్య జలకళ సంతరించుకున్న గోదావరి నది

పెద్దపల్లి – మంచిర్యాల జిల్లాల మధ్య మంథని మండలం ఖాన్‌సాయిపేట– శివ్వారం అటవీప్రాంతంలో సహజసిద్ధంగా ఏర్పడింది ఎల్‌మడుగు. రెండు గుట్టల మధ్య గోదావరి నది పారుతోంది. సరస్సును తలపిస్తున్న దీనిచుట్టూ దట్టమైన అటవీప్రాంతం ఉంది. ఆకాశం ఎత్తున సరస్సుపై ఎగిరే పక్షులు. ఇంపైన కిలకిల రావాలు. నీటిలో తేలియాడుతూ అప్పుడప్పుడు పైకి ఎగిరే చేపల విన్యాసాలు.. అబ్బో.. చెప్పడం కాదు.. చూస్తేనే తనివి తీరుతుంది.

మొసళ్లనూ చూడొచ్చు..

మంచిర్యాల జిల్లా శివ్వారం మొసళ్ల అభయారణ్యంగా పేరొందింది. ఈ సరస్సు(ఎల్‌మడుగు)లో మొసళ్లు సేదతీరడాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉంది. సుమారు 50 – 60 వరకు అరుదైన మొసళ్లు ఉన్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. మంచిర్యాల జిల్లా వైపు ఒడ్డున ఉన్న రాతి గుట్టల నుంచి సహజంగా జాలువారే నీళ్లు.. వర్షాకాలంలో పారే ప్రవాహం నయాగార జలపాతాన్ని తలపిస్తుంది. నాటు పడవతో మొదలయ్యే ప్రయాణం.. ప్రకృతి ఒడిలోకి తీసుకెళ్తుంది. శివ్వారంగుట్టపై రాతి కట్టడాలు చూస్తే అప్పటి శిల్పకళ, నిర్మాణశైలి ఆశ్చర్యపరుస్తుంది. రాతిగుట్టను తొలచి కట్టడాల మధ్య నిర్మించిన శివలింగం.. పురాతన కళానైపుణ్యానికి అద్దంపడుతోంది. అయితే ఈ ప్రకృతి అందాలన్నీ అడవికే సొంతమవుతున్నాయి. ఎంతో ప్రశాంతమైన ఈ ప్రాంతంలో ఒక్క నిమిషం ఆగితే చాలు.. సుగంధ ద్రవ్యాలను మరిపించే మొగిలిపువ్వు వాసనను మనసుకు హత్తుకుంటుంది.

గుట్టపై వాచ్ టవర్

మంచిర్యాల జిల్లా శివ్వారం శివారులోని అభయారణ్యాన్ని.. గోదావరి నది అందాలను తిలకించేందుకు అటవీశాఖ గుట్టపై 2015 ఫిబ్రవరి 5న వాచ్ టవర్ నిర్మించింది. ఇక్కడి నుంచి శివ్వారం మొసళ్ల అభయారణ్యం.. రెండు గుట్టల మధ్య పారే గోదావరి అందాలు.. పచ్చని పంట పొలాలు.. ఇలా ఎన్నోన్నో అందాలను తమ ఒడిలో దాచి ఉంచిన ఎల్‌మడుగును ప్రత్యక్షంగా చూడాల్సిందే.

పర్యాటకంగా అభివృద్ధి చేస్తే..

ఖాన్‌సాయిపేట అటవీప్రాంతంలోని ఎల్‌మడుగు పర్యాటక అభివృద్ధికి ఎంతో అనుకూలంగా ఉందని గత ప్రభుత్వం గుర్తించింది. కొన్నిసాంకేతిక కారణాలతో ప్రగతి పనులు ఆగిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారిస్తే టూరిజం స్పాట్‌గా తీర్చి దిద్దే వీలుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

వేసవిలోనూ నీటి నిల్వలు..


ఎల్‌మడుగు(సరస్సు)లో వేసవిలోనూ మూడు టీఎంసీలు, వానాకాలంలో ఐదు టీఎంసీల వరకు నీటినిల్వలు ఉంటాయని నీటి పారుదల శాఖ అధికారులు తేల్చారు. దీంతో అక్కడ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక్కడ స్ప్రింగ్(నీటి ఊట) ఉన్నట్లు గుర్తించారు. ఏ కాలంలోనైనా నిరంతరం మూడు టీఎంసీల నీరు, 35 మీటర్ల – 40మీటర్ల లోతు ఉంటుందని అధికారులు సర్కారుకు నివేదించారు. అంతేకాకుండా ఎల్‌మడుగు వాటర్ గ్రిడ్‌కు దోహదపడుతుందా? అనే కోణంలో కూడా అధికారులు అధ్యయనం చేశారు.



పురాతన కట్టడాలు



అభయారణ్యం రూట్ మ్యాప్



సరస్సులో మొసలి



శివ్వారం అభయారణ్య ప్రాంతం

ఇలా వెళ్లాలి..

- పెద్దపల్లి జిల్లా మంథని నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలు, బస్సుల ద్వారా సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలోని ఖానాపూర్ గ్రామానికి వెళ్లాలి.
- ఆ గ్రామం నుంచి మరో మూడు కిలోమీటర్ల వరకు వాహనాల్లో వెళ్లే అవకాశం ఉంది.
- కానీ మరోరెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లడం తప్పనిసరి.
- దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో కేవలం ఎడ్ల బండి, ట్రాక్టర్లు మాత్రమే ఈ రహదారిలో ప్రయాణించే వీలుంటుంది.
- దీంతోపాటు మంచిర్యాల జిల్లా శివ్వారం నుంచి కూడా ఎల్‌మడుగుకు చేరుకోవచ్చు.

గుడిసె దగ్ధం

సుల్తానాబాద్‌రూరల్: నారాయణపూర్ గ్రామంలోని బోగె సుమలతకు చెందిన గుడిసె శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిబూడిదయింది. ఆమె భర్త రాజు నాలుగేళ్లక్రితం ట్రాక్టర్ కిందపడి చనిపోయాడు. అన్నీతానై తన ఇద్దరు కుమారులను సుమలత పోషిస్తోంది. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. ఈక్రమంలో శనివారం కూలీపనికి వెళ్లగా గుడిసెకు నిప్పంటుకుంది. మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో రూ.లక్ష నగదు కాలిపోగా, రెండు తులాల బంగారం కరిగి ముద్దయ్యింది. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తక్షణ సాయం కింద రూ.5వేలు, క్వింటల్ బియ్యం అందజేశారు. ఎంపీటీసీ మందల రమేశ్ బియ్యం, నిత్యావసరాలు, దుప్పట్లు అందించారు.



రాజన్న ఆలయం శుద్ధి

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో మార్చి 7 నుంచి నిర్వహించే మహాశివరాత్రి మహోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆలయ గోపురాలను శుభ్రం చేశారు. స్థానిక ఫైర్ సిబ్బంది గోపురాలను నీటి శుభ్రం చేశారు. గోపురాలపై నిలిచిన మురికి, మొక్కలు, పక్షుల గూళ్లను తొలగించారు.



కారుణ్య నియామకాలు పూర్తిచేయండి

గోదావరిఖని: సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా దిగిపోయిన కార్మికుల స్థానంలో వారి పిల్లలకు వెంటనే ఉద్యోగాలు అందేలా చూడాలని డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్జీ–1, 2, 3 ఏరియాల పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఉద్యోగుల సంక్షేమం, డిపెండెంట్ ఉద్యోగాలు, పెండింగ్ నామినేషన్లు, సర్వీస్ సంబంధిత విషయాలు, టర్మినల్ బెనిఫిట్స్, క్వార్టర్ల కేటాయింపు, గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్ తదితర సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గనులు, డిపార్ట్‌మెంట్లలో నూతన నామినేషన్స్ షెడ్యూలు ప్రకారం ఎంతమంది పెట్టుకున్నారు, అలాగే పనిచేసి చనిపోయిన, మెడికల్ అన్‌ఫిట్ లేదా మెడికల్ ఇన్వాలిడేషన్ ఉద్యోగులపై దృష్టి సారించాలని అన్నారు. అర్హత గల డిపెండెంట్ ఉద్యోగాలు, డిపెండెంట్ ఉద్యోగ దరఖాస్తులు, సంక్షేమం, టర్మినల్ బెనిఫిట్స్, క్వార్టర్ల కేటాయింపు, గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్‌పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–1,2,3 పర్సనల్ అధికారులు లక్ష్మీనారాయణ, కిరణ్ బాబు, రాజేంద్రప్రసాద్, హరీశ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

దేహదానానికి అంగీకారం

రామగుండం: మరణానంతరం తమ దేహాలను వైద్యకళాశాలకు దానం చేస్తామని కామని రామస్వామి–సరోజ దంపతులు శనివారం అంగీకార పత్రం సర్పించారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీసీతారామాంజనేయ పిరమిడ్ ధ్యాన మందిరంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, ప్రతినిధులు కేఎస్ వాసు, రాములు అవయవదానంపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో సరోజ–రామస్వామి దంపతులు అవయవదానానికి అంగీకరించారు. దంపతులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రతినిధులు బోళ్ల చంద్రశేఖర్, నర్సింహాచారి, పిరమిడ్ ధ్యాన మందిర్ నిర్వాహకులు కన్నాల రాంచందర్, భూలక్ష్మి, సీనియర్ మాస్టర్ తోట్ల దత్తు తదితరులు పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

• ఆరుగురిపై కేసు.. ముగ్గురి అరెస్టు
• వివరాలు వెల్లడించిన ఏసీపీ జీవన్‌రెడ్డి

హుజూరాబాద్: అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. చెల్పూర్ గ్రామ డీలర్ షబానా సుల్తానా తన భర్త రహీం సహకారంతో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కామారెడ్డిలోని బ్రోకర్‌కు విక్రయించేందుకు కరీంనగర్‌కు చెందిన రేవెల్లి అనిల్‌కుమార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. మహేంద్ర ట్రాలీ వాహనంలో డ్రైవర్ రేవెల్లి జంపయ్య ద్వారా బియ్యాన్ని లోడ్‌వేసి పంపించారు. అప్పటికే రాజాపల్లి వద్ద మాటు వేసి ఉన్న ఎస్సై సాంబయ్యగౌడ్ తన సిబ్బందితో వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో పైన ఖాళీ సంచులు, లోపల బియ్యం సంచులు గుర్తించారు. డ్రైవర్‌తో పాటు డీలర్ భర్త రహీమొద్దీన్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. కరీంనగర్‌కు చెందిన అనిల్ తమ వద్ద రూ.16కు కొనుగోలు చేసి కామారెడ్డికి తరలించి అక్కడ కిలో రూ.21కి విక్రయిస్తాడని తెలిపారు. ఈ మేరకు డీలర్ షబనాసుల్తానా, రహీం, బ్రోకర్ అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. మరో ముగ్గురు రేషన్ బియ్యం బ్రోకర్లపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వెల్లడించారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు..

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు శనివారం డిప్యూటీ తహసీల్దార్ వసంతరావు తెలిపారు. తోకలపల్లి గ్రామంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేయగా 13 క్వింటాళ్ల 64 కిలోల రేషన్ బియ్యం తక్కువ ఉన్నందున డీలర్‌పై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చెల్పూర్ డీలర్ సుల్తానా తోకలపల్లి గ్రామ రేషన్ షాపు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. సదరు డీలర్‌పై చర్యలకు నివేదికను కలెక్టర్, సివిల్ సప్లయ్ ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

కెనాల్‌లో మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండల కేంద్రం శివారులోని కాకతీయ కెనాల్‌లో వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్‌ఐ రామయ్య తెలిపారు. వివరాలు.. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రొయ్యల గణేశ(27), గౌతమ్ అన్నదమ్ములు. ఈ నెల 8న గౌతమ్ నీటి కోసం తిమ్మాపూర్ సమీపంలోని కెనాల్‌లో దిగాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కెనాల్‌లో పడ్డాడు. తమ్ముడిని కాపాడేందుకు కెనాల్‌లో దిగిన గణేశ్ నీటిలో కొట్టుకుపోయాడు. మృతదేహం కెనాల్‌లో కొట్టుకువచ్చి శని వారం ఇబ్రహీంపట్నం వద్ద లభ్యమైంది. మృతుడి తల్లి గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. గణేశ్‌కు భార్య, కూతురు ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మల్యాల(చొప్పదండి): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్న ఘటన ఒబులాపూర్‌లో జరిగింది. పోలీసుల వివరాలు.. ఒబులాపూర్‌కు చెందిన రొట్టె శ్రీధర్ (26) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కడుపునొప్పి భరించలేక జీవితంపై విరక్తితో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీడీసీ పాలకమండలి సభ్యునిగా 'కొండూరి'

• వరుసగా రెండోసారి నియామకం



కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): నేషనల్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎన్‌సీడీసీ), బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పాలక మండలి సభ్యునిగా టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు నియమితులయ్యారు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన రవీందర్‌రావు వరుసగా రెండోసారి దేశంలోని ప్రధాన సంస్థలైన ఎన్‌సీడీసీ పాలకమండలి సభ్యునిగా నియమితులయ్యారు. గ్రామీణ వ్యవసాయ సంస్థలకు శిక్షణనిస్తూ గ్రామీణాభివృద్ధిలో మార్గదర్శిగా ఎన్‌సీడీసీ పనిచేస్తోంది.

ఎంసీ శేఖర్‌కు అంతర్జాతీయ గుర్తింపు



చంద్రశేఖర్

సిరిసిల్ల: జిల్లా కేంద్రానికి చెందిన మేర్గు చంద్రశేఖర్‌కు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ గుర్తింపు లభించింది. టర్కీకి చెందిన ఫొటోగ్రామ్ ఫొటోగ్రఫీ క్లబ్ (ఎఫ్‌పీసీ)– 2024కు సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ సంస్థ చైర్మన్ ఎం.సీ.శేఖర్‌కు గౌరవ మాస్టర్ అవార్డును శనివారం ప్రకటించింది. దేశంలోని వివిధ ఫొటోగ్రఫీ సంస్థలతో కలిసి శేఖర్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ గౌరవ మాస్టర్ అవార్డు లభించింది. చంద్రశేఖర్ తీసిన అనేక ఫొటోలకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభించింది. తాజాగా టర్కీకి చెందిన ఫొటోగ్రఫీ సంస్థ గౌరవ 'మాస్టర్' అవార్డును ప్రకటించడం విశేషం.

నేడు రాష్ట్రస్థాయి కరాటే పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ నరేందర్

కరీంనగర్‌స్పోర్ట్స్: ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఒకినావా కరాటే సంస్థల అధినేత వసంత్ కుమార్ తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి మార్షల్ ఆర్ట్స్ కరాటే దోహదపడుతుందని ఏసీపీ అన్నారు. ఈ పోటీలకు సుమారు 800 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు వసంత్ కుమార్ తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్లు సుమంత్ కుమార్, ప్రవీణ్, రాజశేఖర్, రాకేశ్‌రెడ్డి, రిషికుమార్, శరత్, సందీప్ పాల్గొన్నారు.

వేంపల్లిలో చైన్ స్నాచింగ్

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని వేంపల్లిలో శనివారం బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఓ వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సకినపెల్లి రాజు (60) అనే వృద్ధురాలు వ్యవసాయ పనుల కోసం తోట వద్దకు వెళ్తుండగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోంచి రెండు తులాల పుస్తెలతాడును తెంపుకున్నారు. వృద్ధురాలు గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చేలోపే బైక్‌పై పరారయ్యారు. ఎస్సై నవీన్‌కుమార్ ఘటనా స్థలికి వెళ్లి బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఏటీఎంలో రూ.27.75 లక్షలు చోరీ

• మరో ఏటీఎంలో చోరీకి విఫలయత్నం



గౌతమినగర్‌లో దొంగలు ధ్వంసం చేసిన ఏటీఎం

గోదావరిఖని/ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో దొంగలు రెండు ఏటీఎంలు ధ్వంసం చేశారు. ఒకదాంట్లో నగదు అపహరించారు. మరోదాంట్లోని నగదు చోరీకి విఫలయత్నం చేశారు. కేవలం కొద్ది నిమిషాల తేడాతో జరిగిన ఈరెండు దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. పోలీసుల కథనం ప్రకారం.. మంచి ర్యాల జిల్లా నుంచి గోదావరిఖనిలోని గంగానగర్‌లోకి శనివారం తెల్లవారుజాము 1.30గంటల ప్రాంతంలో కారులో ప్రవేశించారు. అక్కడి ఫ్లైఓవర్ స మీపంలోని హనుమాన్ దేవాలయం వద్దగల ఉన్న ఏటీఎం వద్దకు చేరుకున్నారు. కారులో మొత్తం నలుగురు ఉండగా.. అందులోంచి ఒకడు ఏటీఎంలో చొరబడ్డాడు. తొలుత సీసీ కెమెరాలపై కలర్ స్ప్రేచేశాడు. అనంతరం షెట్టర్ మూసివేశాడు. యంత్రం ముందు డోర్ ఊడగొట్టాడు. పోలీసుల పెట్రోలింగ్ సైరన్ రావడంతో అందరూ పరారైయ్యారు. సొమ్ము చోరీకి గురికాలేదని పోలీసులు వెల్లడించారు.

గౌతమినగర్‌లో..

గంగానగర్‌లో చోరీకి విఫలయత్నం చేసిన దొంగలు.. ముఖాలకు మాస్కులు ధరించి వేకువజామున 1.56 గంటలకు అదే కారులో గౌతమినగర్ హనుమాన్ ఆలయం వద్ద గల ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు చేరుకున్నారు. వచ్చీరాగానే ఏటీఎంలోని సీసీ కెమెరాలపై స్నో స్ప్రే చేశారు. ఆ తర్వాత వెంట తెచ్చుకున్న గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎం యంత్రం ముందుభాగం కట్ చేశారు. సుమారు రూ.27,75,400 నగదు అపహరించారు. సంఘటన స్థలాన్ని రామగుండం ఏసీపీ తులా శ్రీనివాసరావు పరిశీలించారు. దొంగలను పట్టుకునేందుకు మూడు పోలీసు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. హిటాచీ నిర్వాహకుడు గాండ్ల రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అట్టహాసంగా 'అల్ఫోర్స్ గ్లేర్-2024'



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆర్పీ, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ వార్షికోత్సవ సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. అల్ఫోర్స్ గ్లేర్ పేరుతో నిర్వహించిన ఈ వేడుకలు అట్టహాసంగా సాగాయి. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డితో కలిసి శనివారం రాత్రి ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగాయి. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణిస్తూ బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని ఆర్పీ.పట్నాయక్ పిలుపునిచ్చారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా అల్ఫోర్స్ నిలుస్తోందని, విద్యార్థులను అగ్రగామిగా నిలిపేందుకు అత్యుత్తమ బోధనతో పాటు నైతిక విలువలు పెంపొందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త ఆటోను ఢీకొన్న కారు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ శివారులో జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారిపై చెత్త తరలిస్తున్న ఆటోను కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. జగిత్యాల మున్సిపాలిటీలో చెత్త సేకరించే ఆటో చెత్తను తీసుకెళ్లి వదిలిపెట్టి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఆటో డ్రైవర్ జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నిర్దేశిత లక్ష్యం సాధించాలి

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో సేవల విభాగం పాత్ర కీలకమని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ అన్నారు. జీఎం కార్యాలయంలో జీఎం ఆఫీస్, డిస్పెన్సరీ, రెస్క్యూ, ఎంవీటీసీ సిబ్బందితో శనివారం నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వీస్ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ముందున్న సవాళ్లు, కంపెనీ లక్ష్యాలను సాధించడానికి అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో అధికారులు రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, యూనియన్ నాయకుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

రాయికల్(జగిత్యాల): భూపతిపూర్ పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ విధులకు ఆటంకం కలిగించిన గుజ్జరి అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ శనివారం తెలిపారు. భూపతిపూర్‌కు చెందిన గుజ్జరి అంజయ్య తండ్రి 20 ఏళ్ల క్రితం మృతిచెందగా, అతడి మరణ ధ్రువీకరణ పత్రం కోసం కార్యదర్శిని సంప్రదించాడు. ఉన్నతాధికారులను సంప్రదించి ధ్రువీకరణ పత్రం ఇస్తానని కార్యదర్శి చెప్పినా.. అంజయ్య బూతులు తిడుతూ విధులకు ఆటంకం కలిగించాడు.

సంగెంలో వ్యక్తిపై కత్తితో దాడి

కోరుట్లరూరల్: సంగెంలో తాగునీటి పైప్‌లైన్ విషయంలో ఒల్లెపు శ్రీనివాస్, సుర వెంకటి మధ్య శనివారం రాత్రి గొడవ జరిగింది. ఈ విషయంలో సుర వెంకటి, శ్రీనివాస్‌పై కత్తితో మాడుపోట్లు దాడి చేశాడు. గమనించిన కాలనీవాసులు శ్రీనివాస్‌ను అంబులెన్సులో కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.